
సాక్షి
బాపట్ల
బుధవారం । 1 । నవంబర్ । 2023



కార్తికేయుని సేవలో సెంట్రల్ డీజీ

మోపిదేవి: వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామిని సెంట్రల్ డీజీ ఆజాద్ చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4,808 క్యూసెక్కులు విడుదల చేశారు.

నేడు వేటపాలెంలో జగనన్నకు చెబుదాం

బాపట్ల: వేటపాలెంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా మంగళ వారం తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం కార్యక్రమం జరుగుతుందన్నారు.



సిరుల వేరుశనగ

ఒకప్పుడు ముళ్లపొదలు.. దట్టమైన చిల్లచెట్లతో అడవులను తలపించిన భూములు ఇప్పుడు సుభిక్షమై సిరులు కురిపిస్తున్నాయి. వేరుశనగ సాగుతో కళకళలాడుతున్నాయి. లాభాలు పండిస్తున్నాయి. ఫలితంగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇది మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పుణ్యమేనని చెబుతున్నారు. ఉచిత విద్యుత్ తమ పాలిట వరంగా మారిందని పేర్కొంటున్నారు.

- లాభాల్లో రైతులు
- ఏడాదిలో మూడుసార్లు సాగు
- ఇతర జిల్లాలకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులు
- వైఎస్సార్ పుణ్యమేనంటున్న కర్షకులు



వేరుశనగ పంటను తూర్పారబోస్తున్న రైతులు



ఎండబెట్టిన వేరుశనగ పంట

బాపట్ల: జిల్లాలోని బాపట్ల, చీరాల, వేటపాలెం, చిన్నగంజాం, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల పరిధిలో వేరుశనగ సేద్యం ముమ్మరంగా సాగుతోంది. తీర ప్రాంతంలో 15 వేల ఎకరాలకు పైగా విస్తరించింది. ఒకప్పుడు బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం మండలానికి వెళ్లే దారిలో ఎటు చూసినా ఖాళీ పొలాలు ఉండేవి. చిట్టడవులను తలపించేవి. అక్కడక్కడ ఆకుకూరలు, కూరగాయలు సాగుచేసేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భూములన్నీ వేరుశనగ పైర్లతో సుస్వాగతం పలుకుతున్నాయి. బాపట్ల మండలంలోని మరుప్రోలువారిపాలెం, పిన్నిబోయినవారిపాలెం, పాండురంగాపురం, అడవిపల్లిపాలెం, దరివాదకొత్తపాలెం గ్రామాల్లోనూ రైతులు వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టి లాభాలు గడిస్తున్నారు.

ఉచిత విద్యుత్‌తో పొలాలకు మహర్దశ

గతంలో ఈ ప్రాంతంలో నీటి సౌకర్యం ఉండేది కాదు. భూములన్నీ నిరుపయోగంగా ఉండేవి. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకం మహర్దశను తీసుకొచ్చింది. దుండివారిపాలెం, బోలాయపాలెం, తిమ్మారెడ్డిపాలెం, ఏట్రవారిపాలెం, దమ్మనవారిపాలెం, శ్రీరాంనగర్, ఎం.వి.రాజుపాలెం, కొత్తనందాయపాలెం, నల్లమోతువారిపాలెం, పాతనందాయపాలెం గ్రామాల్లో ఉచిత విద్యుత్ పథకం ద్వారా బోర్లను ఏర్పాటు చేసుకునే సౌకర్యం వచ్చింది. ఫలితంగా సుమారు 600 మంది రైతులు తమ పొలాల్లో బోర్లను తవ్వుకున్నారు. మొదట్లో 700 ఎకరాలలో వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం ఇది 15వేల ఎకరాలకు విస్తరించింది. ప్రస్తుత ప్రభుత్వం రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు ఏడాదికి రూ.3 లక్షల ఆదాయం

ఎకరా వేరుశనగ సాగుకు పెట్టుబడి ఖర్చులు రూ.45,000 వరకు అవుతాయని రైతులు చెబుతున్నారు. గరిష్ఠంగా 50 బస్తాల వరకు దిగుబడి వస్తోంది. పెట్టుబడి ఖర్చులు పోను సుమారు రూ. లక్ష వరకు ఆదాయం ఉంటుంది. ఏడాదికి మూడుసార్లు సాగు చేసే రైతులకు ఎకరాకు సుమారుగా రూ.మూడు లక్షల వరకు ఆదాయం ఉంటుంది.

ఐదువేల కుటుంబాలకు నిత్యం ఉపాధి

ఒకప్పుడు ఈ ప్రాంతంలోని కూలీలు ఖరీఫ్ సీజన్‌లో మినహా ఏడాదంతా ఖాళీగా ఉండేవారు. ప్రస్తుతం వేరుశనగ సాగు ఏడాది పొడవునా సాగుతుండడంతో గ్రామాల్లోని సుమారు ఐదు వేల మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. ఏడాదికి మూడుసార్లు వేరుశనగ సాగు చేసే అవకాశం ఉంది. ఫలితంగా తక్కురొల్లడం, కలుపుతీయటం, కాయలు కోయటం, కల్లాలను శుభ్రంచేయటం కాయల నుంచి పప్పును వేరుచేయటం లాంటి పనులు నిత్యం ఉంటున్నాయి.

ఇతర జిల్లాలకు ఎగుమతులు

రాష్ట్రంలో వేరుశనగ పంటకు అనంతపురం జిల్లా పెట్టింది పేరు. ప్రస్తుతం బాపట్ల జిల్లా కూడా వేరుశనగ సాగుకు కేరాఫ్‌గా మారింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు కృష్ణా, ప్రకాశం జిల్లాలకు ఇక్కడి వేరుశనగ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నారు. ముడి వేరుశనగ కాయలతోపాటు ఉడికించిన కాయలు, వేరుశనగ పచ్చిపప్పు, వేయించిన పప్పు తదితర ఉత్పత్తులను ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

రాజన్న పుణ్యమే



మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకం మా పాలిట వరంలా మారింది. మా భూములకు బోర్ల సదుపాయం వచ్చింది. ఫలితంగా వేరుశనగ సాగు చేయడం ప్రారంభించాం. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్షక పథకాలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. వేరుశనగ ద్వారా లాభాలు వస్తున్నాయి.

– వేంకటేశ్వరరెడ్డి, రైతు, కాపూరివారిపాలెం

లాభదాయకంగా ఉంది



ఏడాదికి రెండు, మూడు పంటలు వేయటం ఎంతో లాభాదాయకంగా ఉంది. గతంలో పొలాలన్నీ ఖాళీగా ఉండేవి. ఉచిత విద్యుత్‌తో సాగులోకి వచ్చాయి. ప్రస్తుతం వేరుశనగకు ధర కూడా బాగానే ఉంది. గడిచిన మూడేళ్లుగా వేరుశనగ సాగు బాగుంది.

– శ్రీనివాసరావు, రైతు, వెదుళ్ళపల్లి

ఎన్నికలకు సంసిద్ధం కావాలి

అధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశం

బాపట్ల: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సంసిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణ కమిటీ తొలి సమావేశం మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఎన్నికల నిర్వహణపై అధికారులకు సమగ్ర ప్రణాళిక ఉండాలని కలెక్టర్ తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి ప్రతి కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నాలుగు నెలల ముందుగానే సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లను నియమించుకోవాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, అందులో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. జిల్లా జనాభా 16,80,098 మంది ఉంటే అందులో 12,47,611 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో వసతులు కల్పించాలని సూచించారు.

సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించాలి

సమస్యాత్మక ప్రాంతాలు, పోలింగ్ కేంద్రాలను ముందస్తుగా గుర్తించాలని కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. ఎన్నికల విధులకు అవసరమైన అధికారులు, ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి నియోజక వర్గానికి రెండు స్ట్రాంగ్ రూములు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్ తరలింపు, సంరక్షణకు ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. గత రెండు ఎన్నికలకు సంబంధించిన దస్త్రాలు లేకుండా బాధ్యతారహితంగా సమావేశానికి ఎలా హాజరవుతారని చీరాల తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు తహసీల్దార్లు ఆలస్యంగా హాజరుకావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా చేర్పులు, మార్పులపై గత పది నెలల్లో 1,17,516 దరఖాస్తులు రాగా, 62,547 అర్హమైనవిగా గుర్తించామని, మరో 7,736 దరఖాస్తులు తిరస్కరించామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, జిల్లా అదనపు ఎస్పీ పి.మహేష్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దేశ సమైక్యతకు పటేల్ కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ సమైక్యత, సమగ్రతకు కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిప్రదాత అని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పేర్కొన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంత్యుత్సవం సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి హెనీ క్రిస్టినా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సంస్థానాల విలీనం ద్వారా దేశంలో ఐక్యతను పరిరక్షించిన వ్యక్తి పటేల్ అని కొనియాడారు. భారత జాతీయ ఉద్యమానికి ఆకర్షితుడైన పటేల్ బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా మహాత్ముని నేతృత్వంలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాలు పంచుకున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి, ఏవోలు, ఉద్యోగులు పాల్గొని ఏక్‌తా దివస్ ప్రతిజ్ఞ చేశారు.

రేపటి నుంచి బాలల క్రికెట్ జట్ల ఎంపికలు

నరసరావుపేట డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహణ


నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల రెండో తేదీ నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 బాలబాలికల క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో జరుగుతాయని పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు మంగళవారం వెల్లడించారు. ఆసక్తి కలిగిన బాలలు తప్పనిసరిగా తమ పాఠశాలల్లో రిజిస్టర్ చేయించుకుని ఉదయం 9 గంటల తర్వాత డీఎస్‌ఏ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. 2007 జనవరి ఒకటో తేదీ లేదా తర్వాత జన్మించిన వారై ఉండాలని సూచించారు. సీబీఎస్‌ఈ సిలబస్ లేదా కేంద్రీయ విద్యాలయాల్లో చదువుతున్న వారు తమ పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో మాత్రమే పాల్గొంటామని, ఎస్‌జీఎఫ్ వారు జారీ చేసిన డిక్లరేషన్ ఫామ్‌ను పూర్తిచేసి తీసుకుని రావాలని కోటేశ్వరరావు సూచించారు.

యార్డుకు 38,156 బస్తాల మిర్చి రాక



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 38,156 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 35,429 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,300 వరకు పలికింది. నాన్‌ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.23,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,000 నుంచి రూ.25,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,497 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 525 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 26,754 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 844.20 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌లో మంగళవారం క్వింటాలు నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ 3,200, గరిష్ఠ ధర రూ 4,600, మోడల్ ధర రూ 4,000 వరకు పలికింది.

'సాక్షి స్పెల్‌బీ' సక్సెస్



నంబూరులోని వీవా స్కూల్లో స్పెల్‌బీ రాస్తున్న విద్యార్థులు



కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో సాక్షి స్పెల్‌బీ రాస్తున్న విద్యార్థులు

- గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలల్లో హాజరైన విద్యార్థులు
- పదాలకు అర్థాలను తెలుసుకోవడంలో విద్యార్థుల ఆసక్తి
- ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు పెంచేందుకు దోహదం
- విద్యార్థుల్లో ఆలోచనాతత్వాన్ని ప్రేరేపించి, మేధస్సుకు పదును
- సంతృప్తి వ్యక్తం చేసిన యాజమాన్యాలు, విద్యార్థులు



కేకేఆర్ గౌతమ్ స్కూల్లో సాక్షి స్పెల్‌బీ రాస్తున్న విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలను పెంచే ఉద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన స్పెల్‌బీ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కఠినమైన పదాలకు స్పెల్లింగులు రాసేందుకు పోటీ పడ్డారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి వేర్వేరుగా నిర్వహించిన స్పెల్‌బీ పరీక్ష విద్యార్థుల్లో ఇంగ్లిష్ పదాల ఉచ్ఛారణతోపాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదం చేసేలా ఉందని వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఇంగ్లిష్ వకాబులరీ, ప్రొనౌన్సేషన్ వంటి అంశాలు పోటీ పరీక్షలు రాసేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయనే భావన వ్యక్తమైంది. విద్యార్థుల్లో ఆలోచనాతత్వాన్ని ప్రేరేపించి, మేధస్సుకు పదును పెట్టేలా నిపుణులతో రూపొందించిన ప్రశ్నపత్రంతో స్పెల్‌బీ పరీక్ష ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగింది. పాఠశాలస్థాయిలో నిర్వహించిన స్పెల్‌బీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జిల్లాస్థాయి, రీజినల్ స్థాయికి ఎంపికయ్యే అవకాశాలు ఉన్నాయి.

స్పెల్‌బీ నిర్వహించిన పాఠశాలలు

గుంటూరు నగరంలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్, విజ్ఞాన్ స్కూల్, నంబూరులోని వీవా స్కూల్‌లో జరిగిన స్పెల్ బీ పరీక్షకు 188 మంది విద్యార్థులు హాజరయ్యారు.

తొలిసారి రాస్తున్నా



సాక్షి స్పెల్‌బీ రాయడం ఇదే తొలిసారి. ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో కఠిన పదాలకు స్పెల్లింగులు రాయడం బాగుంది. క్లాస్‌రూమ్‌లో టీచర్ చెప్పిన విషయాలతోపాటు ఎన్నో కొత్త వర్డ్స్ ఉన్నాయి. వాటికి అర్థాలను తెలుసుకుని, రాయడం చాలా బాగుంది.

– గగనా, 4వ తరగతి, కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్

ఇంగ్లిష్‌పై పట్టుకు దోహదం



ఇంగ్లిష్ లాంగ్వేజ్‌పై పట్టు సాధించేందుకు స్పెల్‌బీ దోహదం చేస్తుంది. ప్రశ్నపత్రం ఇచ్చిన విధానం బాగుంది. పాఠశాలలో చదివే పాఠ్యాంశాలు, సిలబస్ నుంచే ఇవ్వడంతోపాటు కఠిన పదాలకు స్పెల్లింగులు రాయడం ఎంతో ఆసక్తిగా ఉంది. వకాబులరీలో అర్థాలు తెలుసుకునేందుకు అవకాశం కలిగింది.

– ఎస్.సాయిచరణ్, 8వ తరగతి, కేకేఆర్ గౌతమ్ స్కూల్

ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరుగుతోంది



నాకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ అంటే ఇష్టం, ఇంగ్లిష్‌లో ప్రతి ఒక్క వర్డ్‌కు అర్థమయ్యేలా చెప్పి, స్పెల్లింగ్ రాయించే విధానం నచ్చింది. టెక్ట్స్ బుక్‌లో నుంచి పాఠాల నుంచి మా టీచర్ చెబుతున్న విషయాలతో పాటు కొత్త వర్డ్స్ తెలుసుకున్నాను.

– మనీష్, 5వ తరగతి, కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్

'సాక్షి' కృషి ప్రశంసనీయం



విద్యార్థుల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానాన్ని పెంచేలా 'సాక్షి' ఏటా స్పెల్‌బీ నిర్వహిస్తుండటం అభినందనీయం. కఠినమైన పదాలకు అర్థాలు రాయడంలోనూ, ఇంగ్లిష్‌లో తెలియని పదాలకు అర్థాలను కనుగొనడంలోనూ స్పెల్‌బీ దోహదం చేస్తుంది. ఆధునిక కాలంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్‌కు గల ప్రాధాన్యాన్ని తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.

– మొహ్మద్ ఇంతియాజ్, ప్రిన్సిపాల్ కేకేఆర్ గౌతమ్ స్కూల్

విద్యార్థుల మేధస్సుకు పదును



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్ష విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టేలా ఉంది. ప్రశ్నపత్రంలో ఇచ్చిన పదాలు కఠినంగా ఉండటంతో పదాలకు సకాలంలో స్పెల్లింగులు రాయడంలో విద్యార్థుల ఆలోచనా శక్తి బయటపడుతుంది. కాలానుగుణంగా విద్యార్థుల్లో భాషా పరిజ్ఞానాన్ని పెంపేందుకు ఇటువంటి పరీక్షల నిర్వహణ అవసరం.

– డాక్టర్ కె.శ్రీవిద్య, డైరెక్టర్, కెనడీ ఇంగ్లిష్ మీడియం స్కూల్

పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తాం

జాయింట్ కలెక్టర్ శ్రీధర్



బాపట్ల: జిల్లాలో పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తామని జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ప్రకటించారు. పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జేసీ సమీక్ష నిర్వహించారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించిందని వివరించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. ఒక క్వింటా పత్తికి రూ.7,020 కనీస మద్దతు ధరను నిర్ణయించినట్లు చెప్పారు. మీడియం స్టేపుల్ పత్తి క్వింటా ధర రూ.6,620గా నిర్ణయించినట్లు వివరించారు. పత్తి నాణ్యతను బట్టి ధర ఉంటుందన్నారు. రైతులు బుధవారం నుంచి రైతు భరోసా కేంద్రాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రతిభ



బాపట్ల అర్బన్: ఖాదీ మహోత్సవంలో భాగంగా బాపట్ల జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులను కేటగిరి–1గా, ఇంటర్మీడియట్ విద్యార్థులను కేటగిరి–2గా పరిగణించారు. కేటగిరి–1లో జె.పంగులూరు మండలానికి చెందిన జిల్లా పరిషత్ హైస్కూల్ కొండ మంజులూరు విద్యార్థిని పి.భవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించింది. కేటగిరి–2లో గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.పుష్ప ప్రథమ స్థానం సాధించింది. వక్తృత్వం పోటీల్లో కేటగిరీ–1 విభాగంలో జె.పంగులూరు మండలం బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని యు.ఖతీజ ప్రథమ స్థానాన్ని సాధించింది. కేటగిరి–2 విభాగంలో గుళ్ళపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన బి.లక్ష్మి ప్రథమ స్థానం సాధించింది. పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

జవాబుదారీతనం కోసం సమష్టిగా కృషిచేద్దాం

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీహరిరావు



మార్టూరు: అధికారులు చిత్తశుద్ధితో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన సమాజాన్ని వారసత్వంగా అందించగలుగుతామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ.శ్రీహరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజాధనం వృథా కాకుండా ప్రజలందరికీ నాణ్యత ప్రమాణాలతో కూడిన సేవలందించడం ద్వారా జవాబుదారీతనంగా ఉండటం కోసం సమష్టిగా కృషి చేద్దాం అని ఆయన పిలుపునిచ్చారు. సంస్థ అవినీతికి నో చెబుదాం వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా అధికారులచే ప్రతిజ్ఞ చేయించి స్థానికంగా ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జియోలజిస్ట్ ప్రసాద్, ఎంపీడీఓ జి.నితిన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

గృహనిర్మాణ శాఖ పీడీ ప్రసాద్



అద్దంకి రూరల్: జగనన్న కాలనీలోని గృహాలు వేగవంతంగా పూర్తిచేయాలని గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్ అన్నారు. మంగళవారం అద్దంకిలోని బొమ్మనంపాడు జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న గృహాలకు యజమానులు క్యూరింగ్ చేసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ దేవసేన కుమారి, గృహనిర్మాణ శాఖ ఏఈ కిరణ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్కేటింగ్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



అద్దంకి రూరల్: జిల్లా స్కూల్ క్యాంపస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలకు మంగళవారం స్థానిక మార్కెటింగ్ యార్డులో ఎంపిక నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ వయస్సులవారు 75 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో మొదటి, రెండుస్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎస్‌జీఎఫ్ బాపట్ల సెక్రటరీ విష్ణుప్రసాద్ తెలిపారు. జిల్లా రోలర్ స్కేటింగ్ సెక్రటరీ జాస్టి కిరణ్, ఒలింపియన్ స్పోర్ట్స్ అకాడమీ ప్రతినిధులు ఆదిత్య, కోచ్ టీవీ పవన్‌కుమార్, ఎస్‌కే అబ్దుల్ లతీఫ్, పర్చూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీస్‌కు సన్నద్ధం !



విద్యార్థులకు మాదిరి ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయిస్తున్న ఉపాధ్యాయుడు

- 3న స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) నిర్వహణకు ఏర్పాట్లు
- జిల్లాలో 990 పాఠశాలల్లో నిర్వహణ
- ప్రాక్టీస్ టెస్టుల్లో నిమగ్నమైన ఉపాధ్యాయులు
- 3,6,9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య మదింపు పరీక్ష

బాపట్ల అర్బన్: పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు ప్రతి మూడేళ్లకు ఎన్సీఈఆర్టీ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారు. అందులో భాగంగా 2024 ఫిబ్రవరిలో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నారు. ముందుగా రాష్ట్ర విద్యాపరిశోధన మండలి ఆధ్వర్యంలో నవంబర్ 3న సీస్ (స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నిర్వహణకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించే ఈ సర్వేకు సంబంధించి ఇప్పటికే జిల్లా కేంద్రానికి పరీక్ష పేపర్లు చేరుకున్నాయి. నవంబరు 2వ తేదీవరకు ఎంపిక చేసిన పాఠశాలల్లోని విద్యార్థులతో ప్రాక్టీస్ టెస్టుల నిర్వహణలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు.

1130 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల నియామకం..

'సీస్' సర్వే నిర్వహించేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్ర విద్యాపరిశోధన మండలి ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 990 పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) ఏవిధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు నిర్వహించే సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల (ఎఫ్‌ఎస్‌ఐ) నియామకం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ, ఇంజినీరింగ్, డైట్ కళాశాలల విద్యార్థులు 1130మందిని జిల్లా విద్యాశాఖ ఎఫ్‌ఎస్‌ఐలుగా నియమించింది.

> **ఏర్పాట్లు పూర్తి**
>
> పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. బ్లాక్ లెవెల్ అధికారులు ఎఫ్ఐలతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు అందజేస్తున్నాం.
>
> – పి.వి.జె.రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి బాపట్ల

వీరికి డివిజన్ స్థాయిలో శిక్షణ ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో డీసీఈబీ సెక్రటరీ, సమగ్రశిక్ష ఏఎంఓ, డైట్ ప్రిన్సిపాల్, లెక్చరర్, డీఈవో కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మండల స్థాయిలో ఎంఈఓ–1, ఎంఈఓ–2లతో పాటుగా, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సర్వే నిర్వహణను పర్యవేక్షిస్తారు.

ప్రాక్టీస్ పేపర్లలో నిమగ్నం..

'సీస్' సర్వేలో భాగంగా 3,6,9 తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష ఓఎంఆర్ విధానంగా ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు ప్రధానంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ పై పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి తెలుగు ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు. తరగతి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు కూడా ప్రశ్నావళికి ఓఎంఆర్ పద్ధతిలో జవాబులు నింపాల్సి ఉంటుంది. ప్రతి తరగతికి పరీక్ష నిర్వహణకు ఒక ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్‌ను నియమించారు.

ముఖ్యాంశాలు ఇవి..

6, 9వ తరగతి విద్యార్థులకు గత సంవత్సరం సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాలు, 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాల సమయాన్ని పరీక్ష రాయడానికి కేటాయిస్తారు.

వల్లభాయ్ పటేల్ జీవితం యువతకు ఆదర్శం

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- అడిషనల్ ఎస్పీ పి. మహేష్



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ

బాపట్లటౌన్: సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ భారతదేశపు ఉక్కు మనిషిగా పేరు గాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని పోలీస్ సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారన్నారు. స్వాతంత్ర్య అనంతరం భారతదేశ తొలి ఉప ప్రధాన మంత్రి, హోమ్ మంత్రిగా పనిచేసి, విశాల భారతావనిని ఏకతాటిపైకి తెచ్చారన్నారు. అడిషినల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, డీసీఆర్‌బీ సీఐ మురళీకృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, హోంగార్డు ఆర్ఐ ఎల్.గోపినాథ్, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యభారత్ నిర్మాణంలో పటేల్ పాత్ర కీలకం

బాపట్లటౌన్: ఐక్యభారత్ నిర్మాణంలో సర్దార్ వల్లభాయ్‌పటేల్ పోషించిన పాత్ర కీలకమైనదని జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ తెలిపారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జిల్లా పోలీస్ శాఖ రాష్ట్రీయ ఏక్తా దివస్‌లో భాగంగా మంగళవారం పట్టణంలో పోలీసులు, విద్యార్థుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద అడిషనల్ ఎస్పీ పి.మహేష్ జెండా ఊపి 3 కి.మీ.పరుగును ప్రారంభించారు. ఈ పరుగు బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ నుంచి భావన్నారాయణ స్వామి గుడి, రథం బజార్, గడియార స్తంభం సెంటర్, పాత బస్టాండ్ సెంటర్ మీదుగా చీలు రోడ్డు వరకు సాగింది. బాపట్ల పాత బస్టాండ్ సెంటర్‌లో పోలీస్ సిబ్బంది, విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. బాపట్ల డీఎస్పీ టి.వెంకటేశులు ప్రతిజ్ఞ చేయించారు. అడిషనల్ ఎస్పీ పి.మహేష్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉప ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడం జరిగిందన్నారు. అప్పట్లో రాజుల పాలనలో ఉన్న స్వతంత్ర్య రాజ్యాలను భారత్‌లో విలీనం చేసి ఐక్య భారత్ నిర్మాణానికి అలుపెరగని కృషి చేసి, భారతదేశానికి పటేల్ తుది రూపు ఇచ్చారన్నారు. ఆయన జయంతిను రాష్ట్రీయ ఏక్తా దివస్, జాతీయ ఐక్యతా దినోత్సవంగా జరుపుకొంటారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని అంకితభావంతో విధులు నిర్వహించాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు. ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, బాపట్ల రూరల్ సీఐ జి.వేణుగోపాల్ రెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, హోంగార్డ్ ఆర్ఐ ఎల్.గోపీనాథ్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సుధాకర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బాపట్ల పాతబస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

జె.పంగులూరు: జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో కొండమంజులూరు విద్యార్థి భవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించింది. ఖాదీ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు బాపట్ల ఏబీఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి అనే మంది విద్యార్థులు హాజరయ్యారు. భవ్యశ్రీకి జిల్లా సైన్స్ అధికారి సాధిక్ ప్రశంస పత్రం, రూ.5 వేల నగదు బహుమతి అందించారు. ఈసందర్భంగా విద్యార్థినిని హెచ్‌ఎం ఐ.అనిత, ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకట్రావు, నాయకులు జంపాని రవిబాబు తదితరులు అభినందించారు.

కబడ్డీ, క్రికెట్ పోటీలకు శంఖవరప్పాడు విద్యార్థులు..

అద్దంకి: అండర్–17 జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు మండలంలోని శంఖవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తేజశ్వాంత్, అదే విధంగా అండర్–14 కబడ్డీలో జట్టుకు బి.చంద్రశేఖర్‌రెడ్డి ఎంపికయ్యారు. వారిరువురినీ హెచ్‌ఎం సాయి నాగభూషమ్మ, పీడీ ప్రభాకర్‌రావు అభినందించారు.

రామోజీ రాతలు హాస్యాస్పదం

- వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్
- నేరుగా తన పేరు పత్రికలో రాసే ధైర్యం లేదని ఎద్దేవా



అనంతవరం గ్రామంలో పర్యటిస్తున్న ఆమంచి

యద్దనపూడి: పచ్చ పత్రికలో తనను అరాచక శక్తిగా పోల్చినందుకు ఈనాడు అధినేత రామోజీరావుపై మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ ఫైర్ అయ్యారు. పత్రికలో అసత్య కథనాలు రాస్తే అందరూ నమ్ముతారని అనుకోవడం అవివేకమన్నారు. మంగళవారం యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఆమంచికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ ఓట్లకు సంబంధించి నియోజకవర్గంలో ఫారం– 7 ద్వారా 14,300 దరఖాస్తులు చేసినట్లు ఆయన తెలిపారు. అందులో సుమారు 100 ఓట్లు వరకు పొరపాటున బతికి ఉన్న వారి పేర్లు చనిపోయిన వారి జాబితాలో నమోదయ్యాయని వివరించారు. మిగిలిన 14200 నకిలీ ఓట్లు పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. పర్చూరు ఈఆర్ఓ స్థానిక ఎమ్మెల్యేకు అమ్ముడుపోయి మగిలిన 14,200 ఓట్లు గురించి విచారణ జరపడం లేదని ఆయన ఆరోపించారు. ఆర్‌టీఐ ద్వారా సమాచారం అడిగినా ఇవ్వడం లేదన్నారు. అనంతరం చంద్రబాబు మధ్యంతర బెయిల్‌కు సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ అనారోగ్య కారణాలతో ఎవరైనా మధ్యంతర బెయిల్ పొందే అవకాశం ఉందన్నారు. 17–ఏ వర్తిస్తుందని చంద్రబాబు వేసిన క్వాష్ పిటిషన్‌ని ఏసీబీ హైకోర్టులు తిరస్కరించడంతో ఇప్పుడు ఆ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. ఈ సమయంలో చంద్రబాబు మధ్యంతర బెయిల్ పొందటం నేరాన్ని పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, జేసీఎస్ కన్వీనర్‌లు, గ్రామ వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు కొడవలవారిపాలెం విద్యార్థులు



కారంచేడు: నవంబర్ 3,4 తేదీల్లో కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి జిమ్నాస్టిక్ పోటీలకు మండలంలోని కొడవలవారిపాలెం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. అక్టోబర్ 30న ఒంగోలులోని ఓరియంటల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు గోగులమూడి చరణ్, ఎల్‌జేవీవీ విజయం సాధించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను హెచ్‌ఎం ఎ.ఉమామహేశ్వరరావు, పీఈటీ పి.శ్రీనివాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. అండర్–14 విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పోటీపడటం ఎంతో పేరు, సంతోషాన్ని ఇచ్చాయని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

కూలీల ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

మేదరమెట్ల: కూలీలతో వెళుతున్న ఆటో బోల్తాపడి ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఈఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామం సోమవరప్పాడు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పొలం పనికోసం మేదరమెట్ల నుంచి ప్రాసంగులపాడు ఆటోలో కూలీలు వెళ్తున్నారు. ఆటో మేదరమెట్ల నుంచి సోమవరప్పాడు వద్దకు రాగానే అదుపు తప్పిన ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కేఎల్‌యూలో ఎన్‌ఎస్‌ఎస్ ఎంపికలు

తాడేపల్లి రూరల్: రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్. విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల జోనల్ స్థాయి ఎంపికలు బుధవారం నుంచి 10 వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీ ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ పి. అశోక్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో వచ్చే ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్ నిర్వహించడానికి వెస్ట్‌జోన్ నుంచి 40 మంది వలంటీర్లను పంపనున్నామన్నారు. కేంద్ర యువ, క్రీడల శాఖల ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జోనల్‌స్థాయి ప్రీ పరేడ్ ఎంపికలకు మొత్తం ఆరు రాష్ట్రాల నుంచి 200 మంది ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొననున్నారని వివరించారు. వీరికి వివిధ పరీక్షలు నిర్వహించిన అనంతరం వారిలో 40 మందిని ఎంపిక చేసి వారిని ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాల్లో జరిగే పరేడ్‌కు పంపుతామన్నారు. ఏపీ నుంచి 44 మంది, తెలంగాణ నుంచి 30 మంది, గుజరాత్ నుంచి 42 మంది, గోవా నుంచి 6 మంది, దయ్యూ డామన్ నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి 74 మంది కేఎల్‌యూకు వస్తున్నారని వివరించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కేవలం బాలికలను మాత్రమే పంపనున్నామని, జోనల్ స్థాయి పరీక్షల అనంతరం ఏపీ నుంచి 10 మందిని ఎంపిక చేసి ఢిల్లీ పరేడ్‌కు పంపున్నామన్నారు.

ఇంటింటికి సురక్షిత నీరు అందించాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ఇంటింటికి సురక్షిత తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. జలజీవన్ మిషన్ పనులలో పురోగతి సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బాపట్ల జిల్లాకు 1,403 పనులు జలజీవన్ మిషన్ కింద మంజూరయ్యాయన్నారు. గ్రౌండింగ్ అయిన 338 పనులు టెండర్ల దశ దాటి పురోగతిలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన 1,065 పనులకు టెండర్లు దశ పూర్తికాకపోవడంపై కలెక్టర్ ఆరాతీశారు. జలజీవన్ మిషన్ కింద రూ. 470 కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నప్పటికీ పనులు జరుగకపోవడం ఏంటని అధికారులను నిలదీశారు. ప్రస్తుతం గ్రౌండింగ్ అయిన రూ.47.62 కోట్ల విలువైన 338 పనులలో 10 పనులు నేటికీ ప్రారంభించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఇప్పటివరకు రూ.17.11 కోట్ల విలువైన పనులు పూర్తికాగా, రూ.16.42 కోట్ల విలువైన పనులకే బిల్లులు ఇచ్చారన్నారు. క్షేత్రస్థాయిలో పనులు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా మంజూరైన పనులలో 156 పనులు రూ. 5 లక్షల లోపు విలువైనవన్నారు. నామినేషన్ పద్ధతిలో చేపట్టడానికి అనుమతులు, అవకాశం ఉన్నప్పటికీ పనులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అలాగే రూ.40 లక్షల విలువ చేసే పనులకు అనుమతి జిల్లా అధికారులకే ఉందన్నారు. అలాంటివి 256 పనులు ఎందుకు మొదలు పెట్టలేదన్నారు. అధికారికంగా 17,451 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం 1,574 కనెక్షన్లు మాత్రమే ఇవ్వడం ఏంటని అధికారులను కలెక్టర్ నిలదీశారు. కుళాయి కనెక్షన్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలలోని పక్కాగృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వడంలో అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సి.హెచ్. విద్యాసాగర్, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

రెండో వివాహమే హత్యకు ఉసిగొల్పింది?

పట్నంబజారు: నగరంలోని గుంటూరువారితోటలో సోమవారం జరిగిన ఫిజియోథెరపిస్టు సత్తెనపల్లి సీతారామాంజనేయులు (36) హత్యకు సంబంధించి కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు పల్నాడు జిల్లా బెల్లంకొండకు చెందిన సీతారామాంజనేయులు తన సోదరి కుమార్తెతో గతంలో వివాహం చేసుకుని బెల్లంకొండలోనే ఉంచాడు. ఈక్రమంలో సీతారామాంజనేయులు అదే ఆసుపత్రిలో ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న స్వాతిరెడ్డిని రెండో వివాహం చేసుకుని ఈక్రమంలో గతకొంతకాలంగా గుంటూరువారితోటలో కాపురం ఉంటున్నాడు. ఇటీవల కాలంలో స్వాతిరెడ్డి ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లింది. అయితే స్వాతిరెడ్డిని రెండో వివాహం చేసుకున్న నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులు సీతారామాంజనేయులను హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈమేరకు అనుమానితుడిగా ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రెండో వివాహం చేసుకున్నాడన్న కోపంతోనే స్వాతిరెడ్డి కుటుంబ సభ్యులు ఈ దారుణానికి పాల్పడి ఉంటారనే క్రమంలో పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.